



కథానిక

రంధి సోమరాజు

భార్య పుట్టింటిదగ్గర ఉంది. తానేమో ఇక్కడ ఉన్నాడు. ఉన్నవాడు ఉన్నట్లుండక, ఓ మిత్రుడితో కలసి బెంగుళూరుకి ప్రయాణం పెట్టుకున్నాడు. అయితే బెంగుళూరు ప్రయాణం పెట్టుకోవడంలో పెద్ద తప్పేమీ లేదు. కొంప మునిగిపోయే తప్పంతా ఆమెకు ముందుగా ఈ సంగతి తెలియబరుస్తూ, ఆమె అనుమతిని పొందకపోవడంలోనే ఉంది! నిజం కూడా అంతే మరి! ఆమెను బెంగుళూరుకు తీసుకొని వెళ్ళకపోవడం సరిగదా; కనీసం చెప్పకుండా వెళ్ళడం—అందులో ఎవరికో ఎవరికో కాదు; కేవలం అర్థాంగికి, ప్రియసఖికి, చెప్పకపోవడం నిజంగా క్షమించవలసిన విషయంకాదు. పోనీ ఇదేమైనపాతబడిపోయిన సంసారమాఅంటే—అబ్బే...అదేమీ కానేకాదు; సరికొత్త, క్రొంగొత్త బ్యూటిఫుల్ కాపురమాయె!

గోపాలానికి ఏమీ పాలుపోలేదు. ఈ సంగతి ఇంత మంచి సంగతి...ప్రయాణాన్ని రేపనగా పెట్టడం అతని కసలే నచ్చలేదు. ఇప్పుడామెకు, రేపు స్టేషనుదగ్గరకొచ్చి తనని కలుసుకోవలసిందని — ఓ కార్డుముక్క వ్రాయడం ఎంత అసహ్యంగా ఉంటుంది! అసలు తనకు ఇలాంటి ఆలోచన ముందుగా తట్టేదే. కాని ఆ ఆఫీసరు మహాశయుడు సెలవు గ్రాంటు చేస్తాడని తా ననుకున్నాడా ఏమిటి? తీరా రేపు ప్రయాణ మనగా సెలవు గ్రాంటయింది.

గోపాలానికి భార్య కళ్ళల్లో ఆడింది. ఆమె పొగ కన్నుల విరిసిన తమాషా తమాషా అందాలు,బహు నేర్పుగా దువ్వుకొని, అందంగా డెకరేట్ చేసుకున్న శిరోజాల ముడిలోని విరహాలు, పొగసైన నవ్వుకోసమే ఉద్భవించినట్లు - చక్కగా కదిలే ఆ రోజాపూల పెదవుల్లోని నిగూఢ రహస్యాలు, అతని హృదయాన్ని గోముగా పెనవేసుకున్నాయి. పాపమవి అతను ఒక్కడుగు కూడా ముందుకు వేయడానికి వీలులేని పరిస్థితి తెచ్చిపెట్టాయి. ఇక ఈ చిక్కులోంచి బయటపడటం ఎలాగో తోచలేదు.

ఏమీ తోచక కుర్చీలో అతను అలాగే కూలబడిపోయాడు. చేతిలో ఉన్న పేపరు ముఖం మీద పెట్టుకొని, ముఖంలోని భావాలను పేపరుతో కప్పుకుని కాస్సేపలాగే కూర్చుండిపోయాడు.

అప్పుడే తలుపుత్రోసుకొని లోనికి మెల్లగా రమణారావు ప్రవేశిస్తూ "ఏరా రాత్రంతా మీ ఆవిడకోసం జాగరంచేశావా ఏం? పట్టపగలు కునుకుతున్నావే" అని గోపాలం ముఖంమీద ఉన్న పేపరును గబాలున లాగేశాడు. గోపాలం మొగంలోని భావాలను సమగ్రంగా సంగ్రహిస్తూన్న ఆ న్యూస్ పేపరు, రమణారావుమీద ఒకసారి చిర్రుబుర్రు లాడింది. గోపాలం విసురుగా చిరాకంతా దులిపేసుకొని "ఓరి ... నువ్వట్రా... ఎవ్వరో అనుకున్నాను" అన్నాడు. అలా అని, సాఫీగా నడచిపోయే కలంలా మాటల్ని సాగదీస్తూ "నాకు సెలవు గ్రాంటు చేశారు తెలుసా" అన్నాడు; కనుబొమలు సుతారంగా ఎగరేస్తూ.

ఆ మాటల్లో ఏమేమి ఎత్తిపొడుపులు దాగి ఉన్నాయో కాని, రమణారావు, "నాకూ గ్రాంటుచేశారు లేవోయ్ ...వెధవ సెలవు... మహా కే

గ్రాంటు చేశారనుకుంటున్నావు కాబోలు" అన్నాడు; సెలవు మంజూరు కావడం, ఏమంత విడ్డూరమైన విషయం కాదన్నట్లు. వెంటనే గోపాలం కుర్చీలోంచి గాలిపటంలా లేచి, "ఏమిటీ నిజంగా..." అన్నాడు; అప్పుడే బెంగుళూరు వెళ్ళిపోయినట్లు. పాపం రమణారావు "నిజమే కాని... నేను రేపు రావడానికి వీలుపడదు. మనం ఎల్లుండి బయలుదేరుదాం" అన్నాడు కొంచెం ఉషారు తగ్గిన కంఠంతో.

వెంటనే గోపాలానికి చక్కని ఆలోచన తట్టి, "నువ్వంతా ఇంతేరా...అసలే సెలవు తక్కువనుకుంటూ వుంటే—మధ్య ఈ కత్తిరింపు లేమిటి? రేపు బయలుదేరితే ఏం కొంప మునుగుతుంది?" అన్నాడు గుణుస్తూ.

గోపాలం సంభాషణను అట్టే పొడిగించకుండా, "ఇంతకీ...ఒక రోజు సెలవు పాడు చేసుకోవాలంటావ్" అంటూ "అలాగయితే నిన్ను ఎల్లుండి బెజవాడలో కలుసుకుంటే ఏం? అనవసరంగా నేనిక్కడ ఉండి ఒక రోజు సెలవు పాడుచేసుకోవడమెందుకూ..." అన్నాడు మనసులోని భావాలను బహు నేర్పుగా అణచిపెట్టి, కళ్ళల్లో అతి సామాన్యమైన చూపు ప్రసరిస్తూ.

వెంటనే రమణారావు, "అలా చెప్పు. నేను అప్పుడే అనుకున్నాను. ఆవిడగారికి చెప్పకుండా మనవాడెలా బయలుదేరుతాడని" సరిగ్గా అంతే అయింది అన్నాడు.

గోపాలం ఒక్కసారిగా కోపం నటించి, 'నువ్వెప్పుడూ ఇంతేరా... వెధవర్థాలు తియ్యడంలో ఫస్టు! నువ్వు రావు; నన్నెక్కడికీ కదలనియ్యవు. పోనీ... అక్కడకు వెళ్ళి, వాళ్ళకు కనిపించి బయలుదేరితే ఇంతలో ఏంపోయింది? నిన్ను స్టేషనులో మరునాడే కలుస్తాగా' అన్నాడు.

రమణారావు, 'సరే...నాకేం...నువ్వక్కడకు వెళ్తే, వాళ్లు నిన్ను కదలనివ్వరేమో అని, అలా అన్నాను. అయితే తప్పకుండా మరి...' అని అతనా వాక్యం పూర్తిచెయ్యకముందే.

'తప్పకుండా, నిన్ను స్టేషనులో కలుస్తారా...' అన్నాడు గోపాలం, అప్పుడాతని కళ్ళు దీపావళి నాడు పసిపిల్లల చేతుల్లో ఆనందంతో వెలిగే గులాబీ రంగు అగ్గిపుల్లల్లా వెలిగాయి.

రమణారావు అక్కడనుంచి కదలి వెళ్ళిపోతూ ...'నిన్ను చూస్తూఉంటే ... అక్కడ ఉండిపోయేట్లుగానే కనిపిస్తున్నావ్. ప్రయాణానికి ఆటంకం రానియ్యి నీపని చెప్తాను' అన్నాడు; ఈ క్రొత్త పెళ్ళికొడుకులతో వచ్చే చిక్కులు పూర్తిగా తెలిసినవ్యక్తిలా... అప్పుడు గోపాలం వట్టిపసివాడిలా, 'ఛీ-ఛీ'అన్నాడు. దానికి అర్థం ఏమిటో మరి!

ఇప్పుడు గోపాలం మనసుఎంతో తేలికపడింది. సాయంకాలానికి విజయవాడ చేరుకోడానికి, అక్కడనుంచి బెంగుళూరు ప్రయాణించడానికి కావలసినవన్నీ ఉషారుగా సిద్ధం చేసుకున్నాడు.

గబగబా ఆఫీసుకువెళ్ళి మధ్యాహ్నం వరకు పనిచేసి, ఆతరువాత పర్మిషను తీసుకొని, సరిగ్గా విజయవాడవెళ్ళే బండి స్టేషనులో హాజరయ్యేప్పటికి, చక్కగా ముస్తాబై తనకోసమే ఆబండి ఆగినట్లు లోనికిపోయి కూర్చున్నాడు.

బండి మెల్లమెల్లగా బయలుదేరి బలేస్పీడు నందుకుంది. బండిలో కూర్చున్న గోపాలం, ఉషారుగా ఓసిగరెట్టుముట్టించి, ఆసిగరెట్టు పొగలో బెంగుళూరునూ, మైసూరునూ సృష్టించాడు. 'అబ్బ! ఈ ఆలోచనలకున్నంత శక్తి, ఈ మానవ శరీరాలకుంటే ఎంత బాగుండును!' అనుకున్నాడు.

బండి విజయవాడ చేరేప్పటికి సూర్యుడుకూడ తన ఇంటికి చేరుకున్నాడు. విదియచంద్రుడు, సన్నగా ప్రియుని నునులేతబుగ్గపై, అతని హృదయేశ్వరి ప్రియమార, సుతారంగా ఉంచిన గోరునొక్కులా పశ్చిమాకాశాన లీలగా మెరుస్తున్నాడు. గోపాలం స్టేషనులోంచి బయటపడి, అత్తవారింటికి సైకిలురిక్షామీద దారితీశాడు.

రిక్షా అత్తవారింటిముందు ఆగీ ఆగగానే, గోపాలం బావమఱది, ఏడెనిమిదేళ్ళ గిరి, 'బావొచ్చాడు, బావొచ్చాడు' అంటూ గోపాలం చేయి పుచ్చుకొని ఇంట్లోకి దారితీశాడు. బావరాగానే వాడికి చాక్లెట్లడబ్బా దొరికినంత ఆనందమయింది. గోపాలాన్ని అతని మామగారుచూసి, ఉత్తరం పత్తరం లేకుండా, అతను ఇంత అకస్మాత్తుగా దిగినందుకు కొంచెం ఆశ్చర్యపోయినా, మనస్సులో తియ్యతియ్యగా నవ్వుకొని, ఎంతో సంతోషించాడు. లత, గోపాలానికి కనిపించీ కనిపించకుండా, అప్పుడే లోపలిగదిలోనికి గబాలున రెండంగల్లో

పారిపోయింది. పారిపోతూ, పారిపోతూ ఆమె తన ఎదలోని వలపెల్ల అట వెదజల్లిపోయింది. అలా ఆమె వెళ్తూ తిరిగిచూసినచూపు గోపాలం గుండెల్ని కదలించింది. ఈ వాతావరణం అంతటినీ చూసేప్పటికి, గోపాలం గుండెల్లో రాయిపడింది. బెంగుళూరు ప్రయాణం సంగతి వీళ్ళకెలా చెప్పాలీ అనీ, అతను బెంగపడిపోయాడు.

తొలుదొల్త అతను ధైర్యంచేసి మావగారిదగ్గర చేరి, "గిరి ఏమైనా చదువుతున్నాడా అండి" అన్నాడు. దీనికా మావగారు, గొంతుకలోనే నవ్వును గలగల పలికించి, "వీడు మా మాట వినే రకంగా ఏమీ కనిపించడంలేదబ్బాయ్! ఇప్పుడే ఇలా ఊగుతున్నాడు... పెద్దయితే...మరీ పెంకిఘటమై పోయేట్లుగా ఉన్నాడు"అని అన్నాడు.

వెంటనే గోపాలం, "మా వూరు పంపించేసెయ్యండి, ఆ పెంకితనమేమిటో నేను చూస్తాను" అన్నాడు; తలుపుమీద ఒక కాలువేసి, ఆ తలుపు పుచ్చుకొని ఊగిసలాడుతూన్న గిరివైపు చూస్తూ. ఈ మాటలను ఏమాత్రం లక్ష్యపెట్టని గిరి, బావ వైపు తిరిగి వెక్కిరించడం మొదలుపెట్టాడు. అలా వెక్కిరిస్తూన్న గిరిని గోపాలం గబాలున పట్టుకోడానికని కుర్చీలోంచి లేచాడు. కాని వాడందుతాడూ...గోపాలం నవ్వుకుంటూ తిరిగి తన స్థానంలోకివచ్చి, అప్పటికి తన ప్రయాణం సంగతి మావగారికి చెప్పడానికి వీలైన పరిస్థితి ఏర్పడినట్లు ఫీలయి—మెల్లగా..."ఎల్లుండి నేను, బెంగుళూరు వెళ్తున్నానండీ"అన్నాడు, మొగాన్ని గిరికోసం వెదుకుతూన్నట్లు ఆవైపునకు త్రిపి.

పాపమా మావగారు ఒక్కసారి ఆశ్చర్యపోయి "ఆ...ఏమిటీ...బెంగుళూరా! ఇప్పుడెందుకు?"

గోపాలం, "మా స్నేహితుడూ, నేనూ అక్కడకు వెళ్ళాలని చాలకాలంనుంచి అనుకుంటున్నామండి. ఇన్నాళ్ళకు సెలవు దొరికింది"అన్నాడు. అప్పుడే లోపలి గదిలోంచి ఒక సన్నని కంఠం కుతకుత ఉడుకుతూ, "ఔను; ఇక్కడ ఉండటానికైతే సెలవు దొరకదు"అని బుసబుసలుకొట్టడం అతనికి వినిపించింది.

గోపాలం, ఈసారి మావగారి కళ్ళలోకి నేరుగా చూసి, "చూడండి మీఅమ్మాయి ఎలా అంటుందో" అన్నట్టు పోజుపెట్టి, ఏమీ మాట్లాకుండా ఊరుకున్నాడు.

ఆ మావగారు ఎంతో బాధపడుతూ, "నువ్విక్కడ నాలుగురోజులుంటావని ఎంతో సంబరపడ్డానే"అని ఇంతలో ఎవరో కేకవేస్తే, ఆయన వీధిలోకి వెళ్ళాడు.

పాపం లత, గోపాలాన్ని చూసి ఎంత సంతోషించిందో, ఈ మాట వినగానే అంతగానూ బాధపడింది. భర్త చేసిన పనికి ఎంతగానో కోపగించుకుంది. గిరిని పిలిచి, "ఈ ఒక్కరోజుకూ ఇక్కడకు రావడమెందుకురా? ఇంటికి దయచెయ్యమనిచెప్పు" అంది గోపాలానికి వినబడేట్టుగా.

గోపాలం లోలోపల దిగులుపడుతూనే, పైకి పకపకా నవ్వి, "ఇదేం వాళ్ళ ఇల్లు కాదని చెప్పవోయ్ గిరీ...వాళ్ళ యిల్లు మా వూళ్ళో ఉందని చెప్పు"అన్నాడు.

లత, ఈ మాటలకు ఉడికినా, కొంచెం నవ్వకుండా ఉండలేకపోయింది. "అసలు దగ్గరకు చేరకుండానే వుండాలి. అయ్యగారు అప్పుడు చెప్పకుండా ఎలా వెళ్తారో చూడాలి"అని నిర్ణయించుకుంది.

ఆతరువాత గోపాలానికి లత కంఠం వినిపించడంగాని, ఆమె ఆచూకీ తెలియడంగాని జరుగలేదు. అతనికీ యిబ్బందినుంచి ఎలా దాటాలో తోచలేదు. "మాట్లాడకపోతే పోనియ్, చెప్పకుండానే వెళ్ళిపోతాను. ఏమిటీ వెధవ బెట్టు"అని మనసులో అనుకున్నాడు.

ఆ రాత్రి భోజనాలయిన తరువాత, గదిలో ఒక్కడూ పడుకొని లతకోసం ఎంతోసేపు ఎదురు చూశాడు. కాని ఆమె ఎప్పటికీ ఆ గదిలోనికి రానేలేదు. అతని కళ్ళముందు రమణరావు అవతరించాడు.

"అక్కడకు వెళ్ళితే...వాళ్లు నిన్ను కదలనిచ్చినట్లే..." అని అతని కంఠం గోపాలాన్ని ఎకసెక్కంతో సవాలుచేసింది. గోపాలానికి పౌరుషం వచ్చింది. 'నన్నెలా ఆపుతుందో చూస్తాగా...' అనుకున్నాడు. బెంగుళూరు ప్రయాణాన్ని ఏ పరిస్థితుల్లోనూ మానుకోకూడదని, గట్టిగా నిశ్చయించుకొన్నాడు. 'మహా...ఈవిడగారి కోపం

మనల్నేం చేస్తుందేమిటి? అక్కడనుంచి వచ్చేప్పుడు చీరలూ అవీ తెచ్చిపడేస్తేసరి కోపం గీపం ధూపంలా ఎగిరిపోతుంది’ అనుకున్నాడు. ఈ ఆలోచన తట్టగానే, అతని చేతిలోని పుస్తకం టేబులు మీదకు ఎగిరి గంతేసింది. అతని మొగం మీదికి నవ్వు గాలిలో ఎగిరే ఫుట్‌బాల్‌లా ఎగిరింది. అంతే... అతను మంచంమీంచి క్రిందికి ఒక్క ఉరుకు ఉరికాడు. ఉరికీ ఉరకగానే ఎదురుగుండా లత! తన కోసం భువిపై అల్లారు ముద్దుగా అవతరించిన మినువాక! ఎనలేని సుందరస్వప్నాల మాధుర్యాల రేఖ! ప్రత్యక్షమయింది! ‘ఓఁ...లతా...’ అంటూ గోపాలం ఆమెను అమాంతం కౌగలించేసుకున్నాడు.

గోపాలానికి కనిపించకుండా ఉండాలనుకున్న లత, మరి ఏమి ఉద్దేశించిందో కాని, ఆ గదిలోనికి కోపాన్ని అణచేసుకునే వచ్చింది. వచ్చీరాగానే ఈ హఠాత్ పరిరంభణంలో చిక్కుకున్న ఆమె “అబ్బా! ఏమిటోఁ ఇది” అని అతన్ని విదలించుకొని కోపాన్ని నటిస్తూ “వెళ్ళండి బెంగుళూరు” అంది. వెంటనే ‘నేను వెళ్ళడంలేదుగా’అన్నాడు గోపాలం. ఈ మాట అతని కంఠంలోంచి తటిల్లతలా ఊడిపడింది.

లత కళ్ళు విశాలంగాతిప్పి “నిజం?” అంది అతని కళ్ళల్లో అబద్ధాన్ని గాలిస్తూ, నమ్మనట్టు శంకిస్తూ.

“నిజం” అన్నాడు గోపాలం. అందులో అసత్యమన్నది ఈషణ్మాత్రమూ లేనట్టు.

లత అంతటితో అతన్ని వదల్లేదు. “ఒట్టెయ్యండి” అంది.

“ఓఁ...ఏ ఒట్టు పడిగితే ఆ ఒట్టు. నన్నింకా నమ్మవా” అన్నాడు.

ఆమె పెదవి విరచి, నమ్మనట్లు తలూపి, ఇంతలోనే ఆమెతలలో ఏదో మెరసినట్లయి అతని కళ్ళల్లోకి సూటిగా నవ్వుఫోకస్ చేసి, “అయితే మీ మిత్రుడికి ఇప్పుడే ఓ టెలిగ్రాం రాయండి. రేపొద్దున్నే పంపుతాను” అంది.

పాపం గోపాలం కళ్ళు ఆ ఫోకస్‌ను తట్టుకోలేక పోయాయి. “అయినా ఇంకా ఇరవైనాలుగు గంటలుపైనే టైముంది. ఎన్ని అద్భుతాలనైన సాధించడానికి వీలుంది అనుకుంటూ, “తీసుకురా కాగితం కలం...” అన్నాడు. ఈ మాటలను ఎంత చక్కగా అన్నాడంటే—ఆ మాటలు విన్నవాళ్ళు “కాగితం కలం ఎందుకండీ... మీ మాటమీద మాకు • విలువుంది...” అనేటంత నేర్పుగా అన్నాడు.

అయితే ఏం? లతమాత్రం కాగితం కలం తేవడం మానలేదు. క్రీగంట అతన్ని చూస్తూ “ఊఁ... రాయండి” అంది. పాపం గోపాలానికి వ్రాయక తప్పిందికాదు. దాన్ని ఆమె ఒకసారి చదువుకొని అంతా సరిగానే ఉన్నట్టు నవ్వి దాన్ని జాగ్రత్తగా డ్రాయరులోపెట్టి తాళం వేసింది.

గోపాలానికి కథంతా అడ్డం తిరిగినట్లయింది. కాని ఇంతలో అతని మెదడు “ఎందుకలా ఇదౌతావ్ గోపాలం? నువ్వింకో టెలిగ్రామ్ అతనికిస్తే సరి... లేకపోతే ఫోనులో మాట్లాడు” అంది.

“ఔను... ఇంతే ... ఇలాగే చెయ్యాలి. ప్రయాణం మాత్రం చస్తే ఆపగూడదు” అని ఖచ్చితంగా నిర్ణయించుకున్నాడు గోపాలం. ఈ చక్కని ఆలోచన తట్టినందులకు తనను తనే ఎంతో అభినందించుకున్నాడు. కాని ఇంతలోనే “ఆ రమణగాడు ఈ టెలిగ్రాములూ అవీ చూసి, ఏం ఆటలు పట్టిస్తాడో”అని ఎంతో బాధ పడ్డాడు. “అయినా ప్రాణస్నేహితునికి ఇలాంటివి తెలిస్తే వచ్చే ప్రమాదం ఏమీ లేదు” అని మనసును సముదాయించుకొన్నాడు.

లత ఎందుకనో ప్రక్కగదిలోనికి ఒకసారి వెళ్ళి తిరిగి వెంటనే గోపాలందగ్గరకొచ్చి “ప్రయాణం ఆపుచేసేశానని బాధపడుతున్నట్లుందే...” అంది. మాంచి తెలివిగల ప్లీడరులా.

గోపాలం పప్పులో కాలువేసేవాడే కాని, గబాలున ఆ జారిపోతూన్న కాలును గోళ్ళతో నొక్కిపెట్టి, “అదేమిటీ ... నువ్వు చెయ్యడమేమిటీ...నా అంతట నేనే మానేస్తే..బలే దానిలా ఉన్నావే...” అన్నాడు. వెంటనే లత పూలజల్లుగా నవ్వుతో “ఎంతత్యాగం చేశారండీ”అంది. అలా అని గోముగా అతని చెక్కులు నిమురుతూ, “మిమ్మల్ని ఆపుచేసేశాను చూశారా” అన్నట్టుగా అతని బుగ్గమీద సన్నగాగిల్లి, ఆ గిల్లినచోట గట్టిగా ముద్దుపెట్టుకుంది. గోపాలం, “లత ఎంత పిచ్చిది! బలేగా మోసపోయింది” అనుకుంటూ మెల్లగా

నవ్వి, లత కళ్ళల్లోకి చిలిపిగా చూస్తూ, ఆమెను తన కౌగిటిలోకి గబాలున లాక్కున్నాడు.

ముచ్చటైన ప్రేయసీ ప్రియులమధ్య ఒకరాత్రి గడచిపోవడం ఎంతసేపు!

పిచ్చి పిచ్చిగాఉన్న ఎర్రని చారలమధ్య సూర్యుడు నిద్రలేచాడు. ఆ చారలతో తన మొగాన్ని ఈ లోకానికి చూపించడాని కాత డొంకించుక సిగ్గుపడ్డాడు.

రాత్రి అనుభవించిన అనుభవాల మధురస్మృతులనుండి గోపాలం హాయిగా మేలుకుంటూ లతను మోసగించ గలుగుతూన్నందులకు లోలోన సంతోషిస్తూ, వెంటనే పోస్టాఫీసుకు వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. లతకు తెలియకుండానే అక్కడకువెళ్ళి వచ్చేయాలనుకున్నాడు.

అప్పుడేగిరి అక్కడకువచ్చి, బావగారి మొగం లోకి చూసి, పకపకా నవ్వి లోపలగదిలోకి వెళ్ళిపోయాడు. "అక్కా...ఇలారా ..." అంటూ వాడు లతను అక్కడకు లాక్కొచ్చాడు. గోపాలం నవ్వుతూ లతవైపుచూసి, "టెలిగ్రాం పంపించేశావా..." అన్నాడు. ఈ మాటలు వినిపించుకోకుండా లత, గోపాలం మొగం వైపు చూస్తూ పొట్టచెక్కలయ్యేట్టు నవ్వడం మొదలుపెట్టింది, గోపాలం, "ఏమిటే ... అలా పిచ్చిదానిలా నవ్వుతావు" అన్నాడు అని, "టెలిగ్రాం ఇచ్చేసినంత మాత్రంలో కొంపమునిగి పోలేదులే...ఇప్పుడే వెళ్ళి వాడికీసంగతి ఫోనులో చెప్తాను చూడు." అన్నాడు. ఇక ముసుగులో గుద్దులాట ఎందుకనుకున్నాడో ఏమో...అలా పూర్తిగా బయిట పడిపోయాడు. లత వస్తూన్న నవ్వు నాపుకుంటూ, "ఏమని చెప్తారు?" అంది. పాపం వెర్రి గోపాలం "ఏమనేమిటి? ఏం జరిగిందో అదే చెప్తాను. ప్రయాణం ఆరు మూడైనా, మూడు ఆరైనా ఆగదని చెప్తాను. తప్పకబయలుదేరి రమ్మంటాను".

"అలాగా...పాపం!,' అంటూ లత ఇంకా ఇంకా ఎక్కువైపోతూన్న నవ్వును, ఆపుకోడానికి ప్రయత్నించింది. గిరిగాడు, బావగారి మొగంలోకి తమాషాగా చూస్తూ, "ఒకటి...రెండు...మూడు నాలుగు..." అని ఏమిటో లెక్కపెట్టాడు. గోపాలానికి ఆ నవ్వులమధ్య, పిచ్చెక్కినట్లయి "ఏమిటిగిరీ... ఎందుకానవ్వు" అని గట్టిగా అరిచాడు. అయినాగిరి, నవ్వు నాపుకోలేదు. ఈసారి గోపాలం మొగం వైపు వ్రేలుపెట్టి చూపుతూ "ఒకటి, రెండు, మూడు, నాలుగు" అన్నాడు. గోపాలానికి తన మొగంమీద ఏముందో అర్థం కాలేదు. మొగంమీద అక్కడక్కడ ఏమిటో చురచురమంది. "ఏమిటే...మొగం మండుతూంది' అనుకున్నాడు. గిరిమళ్ళీ అంకెలు లెక్కపెడుతూ, "చంద్రవంకలు, చంద్రవంకలు" అన్నాడు. గోపాలం, "చంద్రవంకలేమిటి..!మీ అక్కను మీనాన్న చేయిస్తున్నాడా..." అని నవ్వాడు. "అక్కను కాదు బావా...నీకే చేయించాడు..." అంటూ వాడు చిమ్మనగ్రోవిలోంచి వచ్చే నీళ్ళలానవ్వును, కళ్ళలోంచి, మొగంలోంచి వెదజల్లాడు. వెంటనే లత, "మా అమ్మ చంద్రకాంతులు వండుతూం దండీ...వాటినివాడు లెక్కపెడుతూంట" అంటూ ప్రవాహంలా వస్తూన్న నవ్వును ఆపుకోలేక పోయింది. గిరి తెయ్యిన గెంతుతూ, చంద్రకాంతలూ లేవు ... ఇంద్రకాంతలూ లేవు ...గోరు నొక్కులు బావా ... గోరునొక్కులు ..." అన్నాడు.

గోపాలానికి ఒక్కసారి వంటినిండా జెర్రెలు ప్రాకినట్లయింది, గబాలునవెళ్ళి అద్దంలో పెట్టాడు. అద్దంలోని ముఖం 'ఇది నీ మొగమేనేమో చూసుకో" అంది. పాపం గోపాలం పిచ్చిగా ఒక్క గావుగాకపెట్టి, 'లతా' అంటూ అరిచాడు. లతను నమలి మ్రింగేయాలన్నంత కోపంతో. అప్పటికప్పుడే లతా, గిరీ...అక్కడనుంచి ప్రక్క గదిలోకి చల్లగా జారిపోయారు.

ఆ లోపలినుంచి వాళ్లు "మూడు రోజులు ఓపికపడితే...మీ ముఖాన్ని మీకు ఇచ్చేస్తాం. అంతవరకూ ఆ గదిలో ఎక్కడికీ కదలకుండా హాయిగా ఉండొచ్చు" అన్న మాటలు నవ్వుల ప్రవాహంతో ప్రసారం చేశారు.

పాపం గోపాలానికి, ఆ రాత్రి లత అలా గిల్లుతూన్నప్పుడు, తనను ప్రయాణంనుంచి ఆపి వేయడానికే ఆమె అలా చేస్తూందన్న ఆలోచన ఎందుకు తట్టలేదో, ఇప్పటికీ తీరని అనుమానంగానే ఉండిపోయింది. ★